శిథిలావస్థలో పశువైద్యశాల


పూర్తిగా దెబ్బతిన్న పశువైద్యశాల

- భయం భయంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని కడుకుంట్ల పశు వైద్యశాలలో విధులు నిర్వహించేందుకు సిబ్బంది భయపడుతున్నారు. ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరి, ప్రమాదకరంగా మారింది. గ్రామంలో తెల్ల పశువులు 378, నల్ల పశువులు 452, గొర్రెలు 9,263, మేకలు 320 ఉన్నాయి. సుమారు 30ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఈ ఆస్పత్రి నుంచి కడుకుంట్ల, అంజనగిరి, నాగవరం, రాజపేట, కాశీంనగర్, మెంటెపల్లి పశువులకు వైద్యం అందిస్తున్నారు. ఈ భవనంలో మూడు గదులున్నాయి. రెండేళ్ల కింద కురిసిన భారీ వర్షాలకు ఓ గదిలో గోడకూలి రంధ్రం ఏర్పడింది. మరో రెండు గదులు పగుళ్లు వచ్చాయి. పగుళ్లు ఏర్పడిన గదిలోనే సిబ్బంది పశువులకు వైద్యం అందిస్తున్నారు. ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన చెందుతున్నారు. సుమారు రెండు దశాబ్దాల నుంచి వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడం వ్యవసాయ పనులు చేసే వారు తగ్గుతుండడంతో పశుసంపదను కూడా రైతులు తగ్గిస్తూ వస్తున్నారు. గతంలో ఇంటికి నాలుగు గేదెలు, రెండు జతల ఎడ్లు, ఉండేవి. కొందరు ఆవుల సైతం పెంచేవారు. పశువుల పోషణ భారంగా భావించడంతో పశు సంపద తగ్గుతోంది. దీంతో ప్రభుత్వాలు సైతం పశువుల ఆస్పత్రులను సైతం పట్టించుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం నిర్వహించే ఉచిత పశు వైద్య శిబిరాల ద్వారా గ్రామాలకు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు. గదులు శిథిలావస్థలో ఉండడంతో మందులను, విత్తనాలను కాపాడుకునే పరిస్థితిలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి కొత్త భవన నిర్మాణం కోసం నిధులు మంజురు చేయాలని రైతులు కోరుతున్నారు.


దుమ్ము చేరిన గదిలో మందులు


పశువైద్యశాలలో కూలిన గది

కూలిపోయే స్థితిలో..

పశువుల ఆస్పత్రి పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలిపోయే దశకు చేరింది. అస్పత్రి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. కొత్త భవనానికి నిధులు మంజూరు చేసేంత వరకు ఇతర భవనంలోకి మార్చాలి. లేదంటే అకస్మికంగా కూలిపోయి ప్రాణాపాయం సంభవించే ప్రమాదముంది.

– కొండన్నగౌడ్, కడుకుంట్ల

ఓ పక్క కూలింది..

కడుకుంట్ల పశువైద్యశాల నిర్మించి సుమారు 30 ఏళ్లు అవుతుంది. వర్షాలకు ఓ పక్క కూలిపోయింది. మిగతా గదులు పగుళ్లు ఏర్పడి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. పశువుల వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్లినప్పుడు కూర్చోవాలంటే భయమేస్తుంది. కొత్త భవనం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.

– కృష్ణకుమార్, రైతు, కడుకుంట్ల

క్లుప్తంగా

29న ఉచిత కంటి వైద్యశిబిరం

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆప్తలమిక్ అసిస్టెంట్ మురళీ తెలిపారు. మండలంలోని ప్రజలు శిబిరంలో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చే వారు తమ ఆధార్‌కార్డును తీసుకుని రావాలని ఆయన కోరారు.

నేడు సవారమ్మ జాతర



అమరచింత: పట్టణ శివారులో వెలసిన సవారమ్మ బోనాల జాతర ఉత్సవం మంగళవారం నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం దేవాలయం ముందు పచ్చని పందిరి వేసి అమ్మవారికి కృష్ణ జలాలతో అభిషేకించి ప్రత్యేక పూజలను చేశారు. మంగళవారం వేకువ జామున అమ్మవారికి అభిషేకాలతో పాటు బోనాలను సమర్పించి పూజలు నిర్వహించి భక్తుల దర్శనార్థం అమ్మవారి విగ్రహాన్ని అలంకరించనున్నట్లు తెలిపారు. భక్తులు బోనాలు, కోళ్లను బలిచ్చి తమ మొక్కులను చెల్లించుకుంటారని, ఇది ఆనవాయితీ అని కమిటీ సభ్యులు తెలిపారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం



అమరచింత: పట్టణంలోని మాదన్న కాంప్లెక్స్ సమీపంలో ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్ స్తంభం ఒరిగిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ట్రాన్స్‌కో అధికారులు పట్టణంలోని ప్రధాన రహదారులపై వేలాడుతున్న తీగలను సైతం సరిచేయలేక పోతున్నారు. పంటపొలాల వెంట వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ తీగలు సైతం నేలకు వాలిపోతున్న వాటిని మరమ్మతులు చేయలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో కేవలం విద్యుత్ బిల్లుల వసూళ్ల కోసం లైన్‌మన్‌లు వస్తుంటారే తప్ప సమస్యలను పరిష్కరించలేక పోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

నీటి వృథాను అరికట్టండి



అమరచింత: పట్టణంలోని మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంకులు శిథిలావస్థకు చేరువలో ఉన్నాయి. స్థానిక దళమికట్ట వద్ద ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ ద్వారా నిత్యం ఓవర్‌ఫ్లో ద్వారా తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోలేక పోతున్నారు. నీరు రోడ్లపై పారుతుండటంతో రహదారులు దెబ్బతింటున్నాయి. విషయాన్ని మున్సిపల్ అధికారులకు, పాలకవర్గానికి తెలిసినా అరికట్టలేకపోతున్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, దళమికట్ట వద్ద నిత్యం వాటర్ ట్యాంకులు నిండి నీరు రోడ్లపై పారుతుంది. ఇప్పటికైన అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారుల సూచనలు పాటించాలి


వెంగళాయిపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఏఈఓ నరేష్

పాన్‌గల్: రైతులు విత్తనాల ఎంపికలో అధికారుల సూచనలను తప్పక పాటించాలని ఏఈఓ నరేష్ అన్నారు. సోమవారం మండలంలోని వెంగళాయి పల్లిలో రైతు సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విత్తనాల ఎంపిక, రకాలు, కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు, పంట మార్పిడి, వాడాల్సిన ఎరువుల తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. రాయినిపల్లిలో ఏఈఓ శైలాజ, ఏఈఓ మహేశ్వరీ అన్నారంతండా, ఏఈఓ అఖిల మాధరావుపల్లిలో రైతులకు అవగాహన కల్పించారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు వహించాలి

వీపనగండ్ల: విత్తనాల కొనుగోలులో రైతులు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుని మోసాలకు గురికాకుండా ఉండాలని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ అన్నారు. సోమవారం వల్లభాపురంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్దే కొనుగోలు చేసి రశీదులు తప్పనిసరిగా పొందాలని అన్నారు.

గోపాల్‌పేట: విత్తనాలు కొనుగోలు చేసేప్పుడు అప్రమత్తంగా ఉండాలని రేవల్లి మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని చెన్నారం రైతువేదికలో రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాలను వ్యవసాయశాఖ అనుమతి పొందిన డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని సూచించారు. విత్తన సంచి సీలు సరిగా ఉందో లేదో చేసుకోవాలని, విత్తన ప్యాకెట్లపై పంటరకం సమాచారం, నాణ్యతా ప్రమాణాలు సరిచూసుకోవాలని చెప్పారు.


వల్లభాపురంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్

మదనాపురం: మండలంలోని నర్సింగాపురంలో సోమవారం రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈఓ స్పందన పలు విషయాలను సూచించారు. సీలు లేని సంచుల్లో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయవద్దని తెలిపారు.

ఖిల్లాఘనపురం: రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు సమయంలో తప్పనిసరిగా వాటికి రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లయ్య అన్నారు. సోమవారం మండలంలోని పర్వతాపురం, ఖిల్లాఘనపురం, మామిడిమాడ, అల్లమాయపల్లి, ఉప్పరిపల్లి, మానాజీపేట, ఆగారం తదితర గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు.

4 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెబ్బేరు రూరల్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 4 ట్రాక్టర్లను సోమవారం పట్టుకుని కేసులు నమోదు చేశామని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శ్రీరంగాపురం మండలంలోని పాత నాగరాల వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న విషయాని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని మెంటపల్లికి చెందిన మంద రాములు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, స్థానిక నాయకులతో కలసి సోమవారం గ్రామంలో మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. రాములు, రాఘవరెడ్డి, మల్లె వెంకటేష్, నాయకులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములకు చెందిన అంకె కురుమయ్య ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. బాధిత కుటుంబానికి పెబ్బేరు సింగిల్ విండో పాలకవర్గం సోమవారం రూ.లక్ష చెక్కును అందజేశారు. వచ్చే సీజన్‌లో మరో రూ.లక్ష మృతుని కూతుర్ల పేరుపై ఎఫ్‌డీ చేస్తామని సింగిల్ విండో చైర్మన్ కోదండరామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కురుమయ్య, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలి

పాన్‌గల్: వర్షాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో గ్రామానికి నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ కోటేశ్వర్ సూచించారు. సోమవారం మండలంలోని దావాజిపల్లిలో నర్సరీని సందర్శించి మొక్కలను పరిశీలించారు. క్రమం తప్పకుండా వాటర్ క్యూరింగ్ చేయాలన్నారు. నర్సరీలల్లో ఏఏ మొక్కలు ఉన్నాయా అనే విషయాలపై ఉపాధి సిబ్బందితో ఆరా తీశారు. అనంతరం కొత్తపేటలో సాగునీటి కాల్వలో నిర్వహిస్తున్న మరమ్మతు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ కుర్మయ్య, ఫీల్డు అసిస్టెంట్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.


దావాజిపల్లి నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కోటేశ్వర్

రమాబాయికి ఘన నివాళి


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తిటౌన్: డాక్టర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి అంబేద్కర్ జీవితాన్ని నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో రమాబాయి అంబేద్కర్ 89వ వర్ధంతిని టీజేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవి గిరిరాజాచారి, లింగంగౌడ్, నాగరాజు, దేవన్న నాయుడు, బాలస్వామి నాయుడు, బండలయ్య, భాస్కర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తితో నెహ్రూకి ప్రత్యేక అనుబంధం

వనపర్తి: దేశతొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూతో వనపర్తికి ప్రత్యేక అనుబంధం ఉందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి గుర్తుచేశారు. సోమవారం స్థానిక నందిహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నెహ్రూ వర్ధంతిలో పాల్గొని ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. వనపర్తి సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేసిన సమయంలో ప్రధాని హోదాలో 1959 అక్టోబర్ 11న స్వయంగా వనపర్తికి వచ్చి రాజమహల్‌ను భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని పాలిటెక్నిక్ కళాశాల నిర్వాహణకు కేటాయించారన్నారు. ఆయన్ను వనపర్తి ప్రాంత ప్రజలు సదా గుర్తుంచుకుంటారన్నారు. సుదీర్ఘకాలంగా దేశ ప్రధానిగా పని చేసిన నెహ్రూ దేశ పురోగతి కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ కృష్ణ, ఎంపీపీ కిచ్చారెడ్డి, కౌన్సిలర్లు జంపన్న, సత్యం, నాయకులు సత్యశీలారెడ్డి, చందర్, సతీష్, లతీఫ్, మధుగౌడ్, రహీం, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.


నెహ్రూ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి, నాయకులు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో నెహ్రూ వర్ధంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే రమాబాయి చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎల్లస్వామి, అశోక్‌రెడ్డి, కుమ్మరి గోవిందు, రాముడు, రామరాజు, శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నెహ్రూతాత వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణ, మహదేవన్‌గౌడ్, హనుమాన్‌రావు, ఆవుల రాఘవేంద్ర, తిరుపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శ్రీరంగాపురంలో నివాళి అర్పిస్తున్న నాయకులు


మదనాపురంలో..

మంత్రిని బద్నాం చేస్తే ఊరుకోం..

చిన్నంబావి: మండలంలోని లక్ష్మిపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి హత్య ఘటనపై మంత్రి జూపల్లిని బద్నాం చేస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ నాయకులు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని పెద్దదగడలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణాప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ శ్రీధర్ రెడ్డి హత్యలో తనను అకారణంగా నిందిస్తున్నారని, ఆయనను నేను హత్య చేయించడానికి గల కారణాలను తెలపాలని బీఆర్ఎస్ నాయకులను ప్రశ్నించారు. తాను 2006 నుంచి జెడ్పీటీసీగా, ఎంపీపీగా సేవలందిస్తున్నాని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి రాజకీయాల్లో లేని సమయంలోనే నేను ఉన్నత పదవులలో ఉన్నానని, అటువంటిది శ్రీధర్ రెడ్డి హత్యలో ప్రమేయం ఉందనడం హస్యాస్పదం అన్నారు.

‘ఆరోపణలు చేయడం సరికాదు’

వీపనగండ్ల: చిన్నంబావి మండలంలో బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి హత్య విషయంలో నిజనిర్ధారణ కాకుండా మంత్రి జూపల్లి ప్రమేయం ఉందని ఆరోపించడం అవివేకమైన చర్య అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీరయ్య యాదవ్, నారాయణ రెడ్డి, కృష్ణయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హత్య జరిగిన కొన్ని గంటల్లోనే ఘటనా స్థలానికి చేరుకున్న కేటీఆర్ మంత్రిపై కక్ష పూరితంగా ఆరోపణలు చేశారని, గతంలో ఇలాంటి ఘటనలో అసత్య ఆరోపణలు చేశారని అన్నారు. 25ఏళ్ల జూపల్లి రాజకీయ చరిత్రలో ఇలాంటి ఘటనలను ఎప్పుడూ సమర్థించలేదని ప్రజాక్షేత్రంలో గెలువలేనివారు దురుద్దేశపూర్వకంగా మంత్రిని బద్నాం చేయాలని చూస్తున్నారని వారు అన్నారు.


చిన్నంబావిలో మాట్లాడుతున్న నాయకులు

రైతన్న అవస్థలు..


జనుంపల్లిలో వడ్లను నింపుతున్న రైతులు

- కేంద్రాల్లో కానరాని సౌకర్యాలు
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు

కోడేరు: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు రైతన్నలు నానా అవస్థలు పడుతున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాని కేంద్రాల్లో కనీస వసతులు ఏర్పాటు చేయడంతో నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో కేంద్రాల్లో ధాన్యం తడిసింది. రైతుల కళ్లెదుటే ధాన్యంరాశులు తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటల దిగుబడి సమయంలో అన్నదాతలు తిప్పలు తప్పడం లేదు. పండించిన పంటలను అమ్ముకోవటానికి అగచాట్లు పడుతున్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అసౌకర్యాలు వెంటాడుతుండటంతో రైతుల కష్టాలు అంతఇంతా కాదు. అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలో ఇలా..

మండలంలో 22 గ్రామ పంచాయతీలకుగాను 17 కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో ఐకేపీ ఆధ్వర్యంలో 16 వరి కొనుగోలు కేంద్రాలు సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఒక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికి సరైన వసతులు కల్పించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం ఆరబెట్టేందుకు ఇబ్బందులు

రైతులు తమ పంటలను కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవడానికి వెళ్తే అక్కడ అసౌకర్యాలతో అవస్థలు పడుతున్నారు. ధాన్యాన్ని ఆరపెట్టడానికి ప్లాట్ ఫాంలు లేవు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడం అడపదడప వర్షాల కారణంగా పొలాల నుంచి నేరుగా కేంద్రానికే తరలిస్తున్నారు. దీంతో కేంద్రాల వద్ద కనీస సౌకార్యాలు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్రాల్లో సిమెంట్ ప్లాట్ ఫారాలు లేక ధాన్యాన్ని మట్టిపైనే పోయాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో రైతులు కిరాయికి పరదాలను తీసుకొచ్చి ధాన్యాన్ని అందులో పోస్తూ ఆరపెట్టుకుంటున్నారు. చలితో పాటు వర్షాలు పడుతుండటంతో ధాన్యం ఆరక తేమ రాక పోవడంతో రోజుల తరబడి కేంద్రాల్లోనే ఉండాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

సరిపడా టార్పాలిన్లు లేక..

కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో రైతులపై అదనపు భారం పడుతోంది. ధాన్యం ఆరబెట్టడానికి టార్పాలిన్లు అద్దెకు తీసుకోవాల్సిన పరిస్థితి. రోజుల తరబడి కిరాయి చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వరి కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించి టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి..



కొనుగోలు కేంద్రాలల్లో సౌకర్యాలు కల్పించాలి. వడ్లు ఆరబెట్టేందుకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి. కేంద్రాల్లో తాగునీటి వసతి కల్పించాలి. కేంద్రాలకు తీసుకొచ్చిన వడ్లకు రక్షణ లేకుండా పోతుంది. ప్రభుత్వం స్పందించి వరి కొనుగోలు కేంద్రాల దగ్గర అన్ని వసతులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

– మోడిమాకుల శేఖర్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, కోడేరు

వసతులు కల్పిస్తున్నాం..

మండలంలో వరి కొనుగోలు కేంద్రాల దగ్గర అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నాం. మండలానికి 95 టార్పాలిన్లు కవర్లు ప్రభుత్వం పంపిణీ చేసింది. కవర్లను రైతులకు ఇచ్చాం. తాగునీటి వసతి, రాత్రివేళలో కేంద్రాల దగ్గర విద్యుత్‌ను కూడా ఏర్పాటు చేశాం. రైతులు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– పార్వతమ్మ, ఏపీఎం, కోడేరు

108లో మహిళ ప్రసవం



ఖిల్లాఘనపురం: మండలంలోని గట్టుకాడిపల్లి చెందిన చెన్నమ్మ సోమవారం 108లో ప్రసవించింది. మహిళకు ప్రసవ సమయం కావడంతో కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆస్పత్రిలో వైద్య సిబ్బంది పరిస్థితిని గమనించి మహబూబ్‌నగర్‌కు రెఫర్ చేశారు. అంబులెన్స్‌లోనే మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మహిళ ప్రసవించి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. 108లో ఉన్న వైద్య సిబ్బంది శేషయ్య, రమేష్ నేరుగా వారిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రసవ సమయంలో సహకరించిన వైద్య సిబ్బందికి మహిళ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వాడిపోతున్న హరిత మొక్కలు

అమరచింత: పట్టణంలోని బస్టాండ్ వెనకాల నాటిన హరితహారం మొక్కలు వాడుముఖం పడుతున్న మున్సిపల్ అధికారులు పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు ప్రార్థనా మందిరాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నాటిన మొక్కలకు నిత్యం వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని అందించాల్సిన అధికారులు మొక్కల సంరక్షణలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దీంతో బస్టాండ్ వెనకాల నాటిన 70 మొక్కలకు ట్రీ గార్డ్లు ఏర్పాటు చేయకపోవడం, నీటిని అందించలేకపోవడంతో వాడుముఖం పడుతున్నాయి. అధికారులు స్పందించి మొక్కల సంరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ఎండిపోయిన మొక్కలు

విద్యుత్ షాక్‌తో ఆవుమృతి

చిన్నచింతకుంట: తిరుమలాపురం సమీపంలోని వ్యవసాయ పొలంలో సోమవారం రైతు భట్టు భోజరాజుకు చెందిన ఆవు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. బాధితుడి కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం వీచిన గాలివానకు గ్రామానికి చెందిన నీలమ్మ పొలంలో 11కేవీ విద్యుత్ వైర్లు తెగి పడ్డాయి. కాగా సోమవారం ఉదయం భోజరాజు అటుగా తన పశువులను మేతకోసం తీసుకెళ్లాడు.. కానీ తెగిపడిన విద్యుత్ వైర్లను గమనించలేదు. ఈ క్రమంలోనే ఓ ఆవు మేత మేస్తూ విద్యుత్‌వైర్‌కు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. కాగా మరోవారం రోజులు గడిస్తే తన ఆవు ఓ లేగ దూడకు జన్మనిచ్చేదని.. ఇంతలోనే ఇలా జరిగిందని బాధితుడు వాపోయాడు. ఆవు మృతితో తాను ఆధారం కోల్పోవడంతో పాటు.. రూ. 70వేల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ

చారకొండ: తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని అగ్రహారం తండాలో సోమవారం ఆయన ఓవర్‌హెడ్ ట్యాంకును పరిశీలించి, పారిశుద్ధ్య కార్మికులతో ట్యాంకును శుభ్రపరిచారు. అనంతరం టెక్నీషియన్లతో వాటర్ క్లోరినేషన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈఈ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు విధిగా నెలలో రెండు సార్లు ట్యాంకును శుభ్రపరచాలని సూచించారు. నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట ఎంపీఓ వెంకటేష్, ఆర్‌డబ్ల్యూఎస్ రితిష్, పంచాయతీ కార్యదర్శి నజీమ్‌సుల్తానా తదితరులు ఉన్నారు.


నీటి క్లోరినేషన్ పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు